హైదరాబాద్ వార్త



## మహిళల అభ్యున్నతి కోసం పాటు పడుతున్న ప్రభుత్వం : హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పాతబస్తీకి చెందిన డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం.కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ పాల్గొన్నారు.

**చార్మినార్,మార్చి 8 ప్రభాతవార్త :**
మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటు పడుతున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు.చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్ సమీపంలోని మొగల్‌పుర ఉర్దూఘర్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.పాతబస్తీలోని పలు ఆసుపత్రులలో వైద్య సేవలు అందిస్తున్న మహిళా డాక్టర్లు,స్టాఫ్ నర్సులు,ఎఎన్ఎంలకు ఆయన మిఠాయిలు అందజేసి శాలువ కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలలోను మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో పాల్గొంటున్నారని తెలిపారు.సమాజ నిర్మాణంలో మహిళా పాత్ర ఎనలేనిదని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు టి.రవీశ్వరరావు, మహ్మద్‌హమేర్,పెంద్యాలలక్ష్మణ్‌రావు, మెహజబీన్,అనూషగౌడ్‌తో పాల్గొన్నారు.

## నెక్లెస్‌రోడ్‌లో ఉత్సాహంగా సాగిన 2కె రన్




రన్‌లో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు

**హైదరాబాద్, మార్చి 8,ప్రభాతవార్త:**
ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా హార్వేనాష్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన 2కెరన్ ఉత్సాంగా సాగింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఈరన్‌లో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా హార్వే నాష్ ఇండియా ఎండీ పి.వియం శ్రీనివాస్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమకు చెందిన రోజు వారి కార్యకలాపాలతోపాటు కీలకమైన విభాగాల్లో మహిళ ఉద్యోగుల సంఖ్య పెరగడమే కాకుండా ప్రస్తుతం పనిచేస్తున్న వారి విశేష ప్రతిభ కనబరుస్తూ ఎంతగానో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కలిగిన ఎంతో మంది మహిళలకు ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించామన్నా రు.ఐటీరంగంలో మహిళలకు చేస్తున్న సేవలకు గురినతంపుగా ఈ2కెరన్‌ను నిర్వహించామన్నారు.ఈకార్యక్రమంలో ఉద్యోగులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోల్నాకలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 8,ప్రభాతవార్త:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గోల్నాక డివిజన్ "ట్విన్ స్విటీ స్కూల్ "లో వేడుకలను ఘణంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా టీచర్లకు విద్యార్థినీ విద్యార్థులకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్, రాజు, అరవింద్ పాల్గొన్నారు.

## సుధాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వెంకట్‌రెడ్డి తక్షణమే బహారంగ క్షమాపణ చెప్పాలి

### తెలంగాణ గౌడ సంఘం డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

**సైఫాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమ నేత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గౌడ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ చెరకు సుధాకర్‌పైన, అతని కుమారుడిపైన భవనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే బహిరంగ క్షమాపణ తెలంగాణ గౌడ సంఘం డిమాండ్ చేసింది. వెంటనే వెంకట్‌రెడ్డి తన ఎంపి పదవికి రాజీనామా చేయాలని, కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డా.మొగుల అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఎన్.రాజయ్యగౌడ్, మారగోని జైశంకర్‌గౌడ్, ఆర్.సంజయ్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ సుధాకర్‌పై వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, బేదిరింపులకు పాల్పడ్డారని, ఒక వీధిరౌడి, గుండాలా వ్యవహరించారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆహర్నిషలు కృషి చేసి, వైద్యవృత్తిలో ఎంతో సేవలు చేసిన సుధాకర్‌పైన, ఆయన కుమారుడిపైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, గౌడ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిశారన్నారు. సుధాకర్ ఒక వ్యక్తి కాదని, శక్తిని అతని వెనుక రాష్ట్రంలోని 70 లక్షల మంది గౌడ్ సామాజిక వర్గం ఉందని, వెంకట్‌రెడ్డికి రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నారని వారు హెచ్చరించారు. వెంకట్‌రెడ్డికి తగిన బుద్ది చెప్పడానికి గౌడ సామాజిక వర్గంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బిసిలు సిద్దంగా ఉన్నారని, ఎక్కడ పోటి చేసిన ఓటమి తప్పదన్నారు. తక్షణమే ఆయన సుధాకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వంగాల బాలరాజుగౌడ్, పల్లె వెంకట్‌గౌడ్, అనురాధగౌడ్, శోభారాణి గౌడ్, రాజకుమారి, విజయలక్ష్మిగౌడ్, పి.మమతాగౌడ్ తదితరులు ఉన్నారు. అనంతరం సంఘం నాయకులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా నాయకురాళ్ళని ఘనంగా సత్కరించారు.

## స్త్రీల చరిత్రను మరుగున పడిపోకుండా చూడటం సామాజిక బాధ్యత : ఓల్గా

**సైఫాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** సామాజిక వికాసంలో రచయిత్రుల కృషిని మననం చేసుకుని ప్రేరణ పొందే కార్యక్రమాలను నిర్వహించాలని పలువురు వక్తలు చెప్పారు. చరిత్ర సృష్టించిన రచయిత్రులు విస్మరణకు గురువుతున్నారని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా విచారం వ్యక్తం చేశారు. స్త్రీల చరిత్రను మరుగున పడిపోకుండా చూడటం సామాజిక బాధ్యతని చెప్పారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సినారె నెలకొల్పిన సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం సారస్వత పరిషత్‌లో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా విధుషిమణులు పేరుతో ప్రాచీన, ఆధునిక కవయిత్రులు, రచయిత్రుల కృషిని గురించి సదస్సు జరిగింది. ప్రముఖ రచయిత్రి ఆచార్య కాత్యాయనివిద్మహే ప్రసంగిస్తూ స్త్రీల సాహిత్యాన్ని మదింపు చేసి సామాజిక వికాస చరిత్రలో వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రాచీన కాలంనాటి కుప్పాంబిక, గోదాదేవి, మొల్ల, తరిగొండ వెంగమాంబ తదితర కవియిత్రుల సాహిత్యాన్ని గురించి ఆమె విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో అయినంపూడిశ్రీలక్ష్మి, డా.కందిమళ్ళ లావణ్య, వారణాసి నాగలక్ష్మి, డా.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# సగానికిపైగా బినామీలే...!

### -మీసేవా కేంద్రాల నిర్వహణలో అక్రమాలు
### -లైసెన్స్ ఒకరిది..నిర్వాహకులు మరొకరు
### -యజమానులపై చర్యలు తప్పవంటున్న అధికారులు




**హైదరాబాద్, మార్చి 8,ప్రభాతవార్త:**
ప్రజలకు ప్రభుత్వం నుంచి అదే కార్యకలాపాలన్నింటికీ కేంద్ర బిందువు మీసేవా కేంద్రాలే.. రెవెన్యూ,జీహెచ్ఎంసీ,ప్రజాపంపిణీ రిజిస్ట్రేషన్,రోడ్డు రవాణా,కార్మికశాఖ,విద్యుత్,వైద్య, విద్య,సంక్షేమం,పోలీసు వాణిజ్య పన్ను తదితర శాఖల సేవలు మీసేవా ద్వారనే అందుతున్నాయి. అయితే ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఏర్పాటైన ఈకేంద్రాలు బినామీ చేతుల్లో కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.వీరు తీసుకున్న కేంద్రాల్లో సేవలకు ఇష్టానుసారంగా ఫీజులు,సర్వీస్‌ఛార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో పరిధిలో సగానికై పైగా మీసేవ కేంద్రాలు బినామీలో నిర్వాహణలో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారికంగా 447ఆన్‌లైన్ కేంద్రాలు ఉండగా ..అందులో టిఎస్ ఆన్‌లైన్ సర్వీసులు 198, ప్రభుత్వ ఈసేవా సర్వీసులు 26,తెలంగాణ స్టేట్ టెక్నికల్ కేంద్రాలు 220 ఉన్నాయి. తాజాగా మరో 70కిపైగా కొత్త కేంద్రాలు మంజూరు చేయనున్నారు. మొత్తం ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్రాల్లో సగానికి పైగా లైసెన్స్ పొందినవారిలో చేతుల్లో లేనట్లు తెలుస్తుంది.

**యజమానులకు బయోమెట్రిక్ తప్పనిసరి...**
ప్రజలకు మరింత పారదర్శంకంగా అందించేందుకు మీసేవా కేంద్రాలను బయోమెట్రిక్‌తో అనుసంధానం చేశారు. మీ-సేవా కేంద్రం యజమానితోపాటు ఒక ఆపరేటర్ మాత్రమే బయోమెట్రిక్ విధానంలో ఆన్‌లైన్ సేవలు అందించేలా ప్రొగ్రామింగ్ రూపొందించారు. బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేయగానే రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నెంబర్‌కు వన్‌టైం పాస్‌వర్డ్ (ఓటిపి) వస్తుంది. ఆఓటిపి ఎంటర్ చేస్తేనే ఆన్‌లైన్ సేవలు ముందుకు వెళ్తాయి. కేంద్రం నిర్వాహకుడు (యజమాని) బయోమెట్రిక్‌పై వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. కేంద్రాల వద్ద నిర్వహణలో ఏచిన్నపాటి తప్పదం జరిగినా దానికి ఆకేంద్రం యజమానే (లైసెన్సుదారు) బాధ్యత వహించాలి. ఇందుకోసం మీసేవా కేంద్రాల నిర్వాహణలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టారు. కేంద్రం యజమాని బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్రలు వేస్తేనే సర్వీసులు అందించేందుకు వీలవుతుంది. దీంతో హైదరాబాద్ మహానగరంలో సగానికిపైగా బినామీల నిర్వాహణలో కొనసాగుతున్న తెలుస్తుంది.

**అన్నిసేవలు మీసేవా ద్వారానే..**
ప్రభుత్వశాఖలకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలన్నింటిని మీ-సేవా కేంద్రాల ద్వారానే కొనసాగుతున్నాయి. రెవెన్యూ,జీహెచ్ఎంసీ, ప్రజాపంపినీ,రిజిస్ట్రేషన్,రోడ్డు రవాణా,కార్మికశాఖ,విద్యుత్,వైద్య, విద్య,సంక్షేమం, పోలీసు వాణిజ్య పన్ను తదితర శాఖల సేవలు మీసేవా ద్వారనే అందుతున్నాయి. దీంతో మీసేవా కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా కుప్పలు తెప్పలుగా గల్లీలో ఈకేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొందరు ఉపాధి కోసమని మీసేవా కేంద్రాలను మంజూరు చేయించుకుని ఇతరకులకు విక్రయించడం,లీజు అద్దె,కమీషన్ పద్దతిపై ఇతరులకు అప్పగించడం పరిపాటిగా మారింది. మరోవైపు మీసేవా కేంద్రాల ముసుగులో అక్రమ దందా కూడా సాగుతున్న ఉందంతాలు వెలుగులోకి వచ్చాయి. కేంద్రాల ఆక్రమ వసూళ్ల అధికారుల దృష్టికి వెళ్తే ఆపరేటర్లు తప్పదం చేశారని యజమానులు కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటున్నారు.

## ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వల్లే మహిళలకు సమానహక్కులు లభించాయి

### -మాజీ ఎంపి వి.హన్మంతరావు



జిహెచ్ఎంసి మహిళా కార్మికులకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపి వి.హన్మంతరావు, చిత్రంలో మహిళా కాంగ్రెస్ నేత ఉషశ్రీ తదితరులు

**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:**
సమాజంలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులుండాలని మాజీ ప్రధానమంత్రులు ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో పంచాయితీ రాజ్‌వ్యవస్థలో వెసులుబాటు కల్పించారని మాజీ ఎంపి వి.హన్మంతరావు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వి.హన్మంతరావు ముఖ్యఅతిథిగా హాజరై జిహెచ్ఎంసి మహిళా కార్మికులకు బహుమతులు అందించి ప్రసంగించారు. ప్రధానంగా అసెంబ్లీలో మహిళలకు సమాన అవకాశాలను కల్పించారని, మహిళాభివృద్ధికి మహిళా సాధికారతకు బాటలు వేశారని అన్నారు. మహిళా సాధికారత ద్వారానే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతారని ఉషశ్రీ అన్నారు. దేశం ఇంత అభివృద్ధి చెందినప్పటికీ ఎక్కడో కొన్ని చోట్ల మహిళలపై వివక్షత ఇంకా కొనసాగుతూనే ఉందని అన్నారు. మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయని, వీటన్నింటిని సంపూర్ణంగా నిర్మూలించడానికి, మహిళలందరు ముందుకు రావాలని అన్నారు. మహిళలు, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే ఈ దేశం అభివృద్ధిచెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, జె.సత్తి బాబు, జి.లక్ష్మణ్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, యువజన కాంగ్రెస్ అధికారప్రతినిధి ఎస్పీ.క్రాంతి కుమార్, గ్రేటర్ హైదరాబాద్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు అజిత్‌యాదవ్, ఆది అవినాష్, షేక్ జమీర్, జాంగిర్, శ్రీధర్ గౌడ్, కిషోర్, సుధాకర్, మహేష్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, మన్మోహన్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సునీతరెడ్డి, లావణ్య, జిహెచ్ ఎంసి సూపర్‌వైజర్ ఆదిల్ బాయ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## నేడు, రేపు నగరంలో పలు ప్రాంతాలలో నీటిసరఫరాకు అంతరాయం

**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త**
హైదరాబాద్ మహానగరానికి మంచీనరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రిం కింగ్ వాటర్ సప్లై మొదటి దశలో సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి వద్ద చేపట్టాల్సిన గోదావరి మెయిన్ 3000 ఎం ఎం దయా పంపింగ్ మెయిన్ పైపు లైన్ బ్రిడ్జి పాసింగ్- బైపాసింగ్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే నూతనంగా కుకునూర్‌పల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే లైన్ నిర్మాణానికి ఆటకం కలుగకుండా గోదావరి మెయిన్‌పైప్‌లైన్‌కు జంక్షన్ పనులు జరపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 9వతేది గురువారం ఉదయం 6గంటల నుంచి 11వ తేది శనివారం 6గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి అధికారులు తెలిపారు.ఈనేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

**పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**

1. ఓ అండ్ ఎం డివిజన్-12 కుత్బుల్లాపూర్: షాపూర్, చింతల్, జీడిమెట్ల,వాణి కెమికల్స్,జగదీర్‌గుట్ట, గాజులరామారం, సూరారం.
2. ఓ అండ్ ఎం డివిజన్-12 మల్కాజిగిరి, అల్వాల్ : డిఫెన్స్ కాలనీ
3. ఓ అండ్ ఎం డివిజన్-19 నాగారం/దమ్మాయిగూడ, కీసర
4. ఓ అండ్ ఎం డివిజన్-23 బొల్లారం: రింగ్‌మెయిన్- 3
5. ఓ అండ్ ఎం డివిజన్-25 కొంపల్లి, గుండ్లపోచంపల్లి ప్రాంతాలు ఆర్‌డబ్ల్యుఎస్ ఆఫ్ టేక్ ప్రాంతాలు కొండపాక- జనగామ, సిద్దిపేట, ప్రజ్ఞాపూర్- గజ్వెల్, ఘన్‌పూర్ మేడ్చేల్, శామీర్‌పేట, కంటోన్మెంట్ ప్రాంతం, ఎంఈఎస్, తుర్కపల్లి బయోటెక్ పార్కు
6. ఓ అండ్ ఎం డివిజన్-14 ఉప్పల్ : కాప్రా మున్సిపాలిటీ పరిధి పాక్షికంగా అంతరాయం ఏర్పడే ప్రాంతాలు
7. ఓ అండ్ ఎం డివిజన్-6. ఎస్ఆర్‌నగర్ బోరబండ, వెంకటగిరి, బంజరాహిల్స్ రిజర్వాయర్ ప్రాంతాలు, ఎర్రగడ్డ, అమీర్‌పేట, ఎల్లారెడ్డి గూడ, యూసుఫ్‌గూడ
8. ఓ అండ్ ఎం డివిజన్-9కుకట్‌పల్లి కెపిహెచ్‌బి, మల్యాసియన్ టౌన్‌షిప్ రిజర్వాయర్ ప్రాంతాలు
9. ఓ అండ్ ఎం డివిజన్-15 శేరిలింగంపల్లి: లింగంపల్లి నుంచి కొండా పూర్ వరకు ప్రాంతాలు, గోపాల్‌నగర్, మయూర్‌నగర్ రిజర్వాయర్ ప్రాంతాలు.
10. ఓ అండ్ ఎం డివిజన్-23 నిజాంపేట ప్రగతినగర్ ప్రాంతం, నిజాం పేట, బాచుపల్లి

## డ్వాక్రా సంఘాల ఉత్పత్తులు భేష్ : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హ్యాండీ క్రాఫ్ట్స్ స్టాల్‌ను ప్రారంభించి కొనుగోలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్‌లో మహిళా కార్పొరేట ర్లు పాలమూరి విజయలక్ష్మి రాజు, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండీ క్రాఫ్ట్స్ స్టాల్‌ను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. స్థానిక కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, పలువురు మహిళా కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించిన మంత్రి స్టాల్‌లోని హ్యాండీ క్రాఫ్ట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటిని తయారు చేసిన మహిళలను అభినందించి ప్రోత్సాహకంగా కొన్ని హ్యాండీ క్రాఫ్ట్స్‌ను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ నాగేశ్వ ర్‌రావు, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్క ల కామేష్‌రెడ్డి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న నిందితుడి అరెస్ట్

**ఉప్పల్, మార్చి 8 ప్రభాతవార్త :** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు చోరీ చేస్తున్న ఒక పాత నేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి డి.జానకి, ఎసిపి పి.నరేష్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఉప్పల్ విజయపురికాలనీలో నివసించే గంటపంగి జయరాజు 26 పూల డెకరేటర్‌గా పనిచేస్తుంటాడు. అయితే జల్సాలకు అలవాటు పడి జాయ్ రైడ్‌లను ఇష్టపడే వాడని తెలిపారు. అతనికి బైక్ లేకపోవడంతో బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో రామంతాపూర్ భరత్‌నగర్, ఉప్పల్ ఐడిఎ, శారధనగర్, విజయపురికాలనీ, నాగోల్ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాల్లో పార్కు చేసిన వాహనాలను చోరీ చేసి ఇంధనం అయిపోయిన తర్వాత వాటిని వదిలి పెట్టేవాడని తెలిపారు. బైక్‌ల పై ఎంజాయ్ చేయాలని కోరికతో వాహనాలు దొంగతనాలు చేసేవాడని, ఒక వాహనం దొంగతనం చేసి ఇంధనం అయినపోయిన తర్వాత మరో వాహనం చోరీ చేసి జల్సాలు చేస్తాడని డిసిపి తెలిపారు. 9వ తరగతి వరకు చదువుకున్న జయరాజు మధ్యలోనే చదువు మానేసి ఫ్లవర్ డెకరేటర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసగా మారి చోరీలు చేస్తున్నాడని తెలిపారు. 2017లో సెల్‌పోన్ చోరీ కేసు, 2019లో ఫోక్సో కేసులో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఈజీ మనీ కోసం జల్సాలకు అలవాటు పడి వాహనాలు దొంగతనం చేస్తున్నాడని తెలిపారు. నిందితుడు బుధవారం ఉదయం ఉప్పల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు యమహా వాహనంతో పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 7 ద్విచక్ర వాహ నాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిపి దేవేంద్రసింగ్ చౌహాన్ ఆధ్వ ర్యంలో డిసిపి డి.జానకి, ఎసిపి నరేష్‌రెడ్డి, సిఐ ఆర్.గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, డిఎస్ఐ కోటేశ్వర్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ



మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ బెంగాలీ సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు మంజిరా నస్కర్,దీపాంకర్ పాల్ చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్,మార్చి 8 ప్రభాతవార్త :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పాతబస్తీలోని సిటీ కళాశాల రహదారి,పెట్లాబూర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణతో పాటు పలు ప్రాంతాలలో తెలంగాణ బెంగాలీ సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు,సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మంజిరా నస క్కర్ ఆధ్వర్యంలో మహిళలకు దాదాపు ఆరువందల చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

### గోల్నాకలో ఘనంగా హోలీ, మహిళా దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గోల్నాక క్యాంపు కార్యాలయంలో బుదవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ, హోలీ వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ మహిళల పక్షపాతిగా నలిచి మహిళల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని చెప్పారు. దేశంలో మహిళల కోసం అత్యధికంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణ ఒక్కటేనని చెప్పారు. గర్భిణిలు, బాలింతల కోసం కెసిఆర్ కిట్‌లు, గర్భిణిలలో రక్తహీనత నివారణ, పోషకాహారం అందించడం కోసం కెసిఆర్ కృషి చేస్తున్నారన్నారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, ఆసరా పెన్షన్లు తదితర ఎన్నోకార్యక్రమాలను కెసిఆర్ చేపడతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో గోల్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హమాలి ప్రాణాన్ని బలిగొన్న ట్రాఫిక్ చలాన్!

### -సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న హమాలి

**సైదాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** ట్రాఫిక్ చలాన్ల వేధింపులు హమాలీ ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. కూలీ పని చేసుకునే తాను పదివేల చలాను కట్టలేనని ట్రాఫిక్ పోలీసులకు చెప్పినా వారు కనికరించలేదని మృతుడు సూసైడ్ నోట్ రాశాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం నేరడిగొమ్ము గ్రామానికి చెందిన ఎల్లయ్య(45) పొట్టకూటి కోసం నగరానికి వలస వచ్చి ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని చింతల్ బస్తీలో కుటుంబంతో పాటు నివాసముంటూ హమాలీ పనిచేసుకుంటున్నాడు. ఎల్లయ్య భార్య సైదాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తుంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి పని ముగిసిన తర్వాత ఇంటికి వస్తుండగా భారత్ గార్డెన్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు అతని వాహనాన్ని ఆపి పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను కట్టి వాహనాన్ని తీసుకువెళ్లాలని చెప్పారు. తాను హమిలి పనిచేసుకుంటానని, చలానా మొత్తం పదివేలు తాను కట్టలేనని ట్రాఫిక్ పోలీసులను బతిమాలుకున్నాడు. అయితే వారు పెండింగ్ చలాన్‌ల డబ్బులు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఎల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లయ్యను వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లినప్పటికీ అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు ఎల్లయ్య మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడు వ్రాసిందిగా చెబుతున్న సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. చలాన్లు కట్టలేనని ట్రాఫిక్ పోలీసులను వేడుకున్నా తనను కనికరించలేదంటూ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్‌లకు తెలుపుతూ సూసైడ్ నోట్‌లో తన బాధను వ్యక్తం చేశాడు. ట్రాఫిక్ ఎస్ఐ వేధించడం వల్లే తట్టుకోలేక చనిపోతున్నానని ఆ లేఖలో పేర్కొన్నాడు. కాగా ఎల్లయ్య మృతిపై సైదాబాద్ పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

**బండి సంజయ్ ట్వీట్..**
తెలంగాణాలో ట్రాఫిక్ చలాన్‌లు డెత్ పెనాల్టీలుగా మారాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ట్వీట్ చేశారు. సామాన్యులపై బిఆర్ఎస్ ప్రభుత్వం, ట్రాఫిక్ పోలీసులు ప్రతాపం చూపడం మాని మానవత్వాన్ని చూపాలని ఆయన ట్వీట్ చేశారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వారసుడొస్తున్నాడు

**-రానున్న ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ స్థానంలో కాలె శ్రీకాంత్ పోటీ?**
**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యపై కొంత వ్యతిరేకతతో వారసుడీ ఎంట్రీ?**

**చేవెళ్ళ, మార్చి 8, ప్రభాతవార్త**

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కుమారుడు కాలే శ్రీకాంత్ చేవెళ్ల అసెంబ్లీపై దృష్టి సారించినట్లు తెలిసింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వారసున్ని రంగం లోకి దింపాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య యోచిస్తున్నట్లు తెలిసింది. రానున్న చేవెళ్ల అసెంబ్లీ స్థానంలో కాలే శ్రీకాంత్ పోటీకి రంగం సిద్ధం చేసు కుంటున్న గుసగుసలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై ప్రజల్లో కొంత వ్యతిరేకత ఉండటంతో ఆయన వారసుడు కాలే శ్రీకాంత్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దింపటానికి పలువురు సీనియర్ నాయకులు కూడ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో సైలెంట్‌గా పావులు కదుపుతు న్నట్లు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కాలే యాదయ్యపై కొంత వ్యతిరేక ఎదురౌ తుందన్న సంఘటనను దృష్టిలో ఉంచుకుని పార్టీ సీనియర్ నాయకులు వార సులకు అవకాశం కల్పిస్తే ఫలితాలుంటాయన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో వారసున్ని రాజకీయంగా ప్రోత్సహించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. చేవెళ్ల ఎమ్మె ల్యే కాలే యాదయ్య వారసుడు కాలే శ్రీకాంత్ మొయినాబాద్ జడ్‌పిటిసిగా కొనసాగుతున్నారు. మొయినాబాద్ జడ్‌పిటిసి కాలే శ్రీకాంత్ రాజకీయంగా తండ్రికి అండగా ఉంటూ ప్రజల్లో ఉంటూ తాను రాజకీయంగా పోటీకి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలను ఇస్తున్నట్లు తెలిసింది. చేవెళ్ల నియోజకవర్గంలోని నాయ కులతో కాలే శ్రీకాంత్ టచ్‌లో ఉంటూ, పలువురు నేతలతో సన్నిహితంగా ఉం టూ నియోజకర్గంలోని సమస్యలపై దృష్టి సారించం ఇందుకు నిదర్శనంగా చేప్పతున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కుమారుడు కాలే శ్రీకాంత్ మొయినాబాద్ జడ్‌పిటిసి, బార్య జయమ్మ నవాబ్‌పేట్ జడ్‌పిటిసి, కోడలు నవాబ్‌పేట్ ఎంపిపిగా కొనసాగుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో పట్నం కుటుం బంలో కూడ పలు పదవుల్లో కొనసాగుతున్నట్లుగా తన కుటుంబంలో సభ్యులు కూడ పదవుల్లో కోనసాగుతున్నారన్న వాదనలు కూడ అధిష్టానంకు వినిపించి నట్లు తెలిసింది. పట్నం కుంటుంబం తమ వారసులను రాజకీయంగా రంగం లోకి దింపుతున్నట్లుగానే కాలే యాదయ్య కూడ తన వారసున్ని అసెంబ్లీ బరికి రంగంలోకి దింపేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. రెండు పర్యా యాలుగా ఎమ్మెల్యేగా సేవలు అందించడమే కాకుండా టిటిడి మెంబర్‌గా కూడ అనేక సేవలు అందించిన అనుభవంతో పాటు సిఎం కెసిఆర్‌కు నమ్మిన బంటు గా ఉండటమే రాజకీయంగా రాణించేందుకు ప్రధాన కారణంగా చేప్పుకుంటు న్నారు. రానున్న ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ టికెట్‌ను సిట్టింగ్‌గైనా తనకు గాని తన కుమారుడికి గాని ఇవ్వాలని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెల్లినట్లు తెలిసింది.

## తిరుమల శ్రీవారి సేవలో ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్


అరుచలంలో స్వామివారి దర్శనంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

**కొడంగల్, మార్చి 8 ప్రభాతవార్త**

ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచిన తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామిని కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ దర్శించుకొని మొక్కులు తీర్చుకు న్నారు. బుధవారం దూప దీప నైవేద్య సంఘం(డీడీఎన్ఎస్) జిల్లా అద్యక్షు లు లోకూర్తి జయతీర్థాచారీ, హస్నాబాద్ పీఏసీఎస్ అద్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, మురారి వశిష్ట, జగదీశ్వర్‌రెడ్డిలతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు అరుణాచలంలోని స్వామివారిని దర్శిం చుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కడప జిల్లా సమీపంలో కొడంగల్ మండల పరిధిలోని లక్ష్మీపల్లి, అంగడి రైచూర్, సంగాయపల్లి తదితర గ్రామాలకు చెందిన 50 మంది భక్తులు శ్రీవారి సేవలో పాల్గొనేందుకు గాను పాదయాత్రగా వెళ్తున్న వారికి ఎంపీపీ పళ్ళు, ఫలహారాలు అందించారు. ఈ సందర్బంగా ఎంపీపీ మాట్లా డుతు ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని, లక్ష్మీపల్లి, సంగాయ పల్లి, అంగడిరైచూర్ గ్రామాలకు చెందిన భక్తులు ప్రతి సంవత్సరం తిరుపతిలో శ్రీవారి సేవకు పాదయాత్రగా వెళ్ళడం ఎంతో పుణ్యసార్ధకమ న్నారు. శ్రీవారి సేవలో కొడంగల్ ప్రాంత వాసులు పాల్గొనడం ఎంతో అదృష్టమన్నారు. కాగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఎంపీపీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- బివిజి ఫౌండేషన్ అధినేత డాక్టర్ సంపత్‌కుమార్**


మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ సంపత్‌కుమార్.

**తాండూరు, మార్చి 8, ప్రభాతవార్త :**

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బివిజి ఫౌండేషన్ అధినేత, బాలాజి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ సంప త్‌కుమార్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తాండూ రు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కల్వ సుధాకర్ భార్య కీ.శే కల్వ అనురాధ జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం బివిజి ఫౌండేషన్, ఆర్యవైశ్య సంఘం సహకారంతో ఈ నెల 13న తాండూరు పట్టణంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపా రు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం 9గంటల నుండి ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో అత్యాధునిక వైద్య పరికరాలతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తాండూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉపాధ్యాయ సంక్షేమానికి ఎస్టీయూటీఎస్ సంఘం కృషి

**-ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సదానంద్‌గౌడ్**


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అద్యక్షులు

**కొడంగల్, మార్చి 8 ప్రభాతవార్త**

ఉపాధ్యాయ సంక్షేమానికి ఎస్టీయూటీఎస్ సంఘం ఎంతో కృషి చేస్తున్నద ని, అందులో భాగంగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పట్ల స్పష్టమై న అవగాహన కలిగి, విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన పోరాట పటిమ గల ఎస్టీయూటీఎస్ అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్ధి బి.భుజంగరా వును గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అద్యక్షులు బి.సదానంద్‌గౌడ్ అన్నారు. బుధవారం కొడంగల్ మం డలంలో ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా డబ్బులు ఎరచపి ఓట్లు వేయించుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పాడుతూ ధనార్జనే ధ్యేయంగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్దు లను ఓడించాలని పేర్కొన్నారు. పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ చిత్తశుద్ధితో బదిలీలు, పదోన్నతులు నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీల్లో సీపీఎ స్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 317 జీఓ బాధిత ఉపాధ్యాయులను వారి స్ధానిక ఆధారంగా వారి సొంత జిల్లా లకు పంపాలని, కేజీబీవీ మోడల్ స్కూల్‌లల బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపా ల్, జిల్లా అద్యక్షులు పవన్‌కుమార్,, అసోసియోట్ అద్యక్షులు విష్ణుకుమా ర్, చంద్రకాంత్, కరుణాకర్, రమేస్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు

## అయినాపూర్ బాధితునికి ఆర్థిక సహాయం

**దోమ. మార్చి 8 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీను ఆర్థిక ఇబ్బందులకుగురై మనస్థాపంతో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో వెళ్ళాడు. దింతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చికిత్స చేర్పించా రు. ఈ విషయం తెలుసుకున్న పర్గి మాజి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి తాను అందుబాటులో లేనందునదోమ మండల కాంగ్రెస్‌పార్టీ అద్యక్షులు మాలి విజయకుమార్‌రెడ్డి ద్వారా బాదితున్ని పరమార్శించి తక్షణ సహ యం కోసం కుటుంబసభ్యులకు 10000 వేలు ఆర్థిక సహాయం అందజే శారు. ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ మునముందు ఎలాంటి చికిత్సనైనా రాంమోహన్‌రెడ్డి వైద్యకళాశాలలో ఉచితంగా వైద్యం అందిం చడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు ప్రజలకు ఉచితంగా వైద్యం అందించుటకు టిఆర్ఆర్ ట్రస్టు ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సాయిగౌడ్, నల్లరా ములు తదితరులు పాల్గొన్నారు.


సహాయం అందిస్తున్న పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**-మహిళల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి**


కొడంగల్‌లో మహిళల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్, మార్చి 8 ప్రభాతవార్త**

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్‌లో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్ధానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చెర్మేన్ ఆర్.వాణీయా దవ్, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు డాక్టర్ శ్రీలతాయాదవ్, సులోచన బీఆర్ఎ స్ మహిళా విభాగం అద్యక్షురాలు అన్నుభాయి, విశ్రాంత ఉపాధ్యాయు రాలు శీలాదేవి, సముద్రమ్మ, మున్సిపల్ కార్యాలయ సీఆర్పీ అనందమ్మలతో పాటు మున్సిపల్ మహిళా కార్మికులను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... మహిళలు అన్న రంగాల్లో ముందుకు రావాలనే సదుద్దేశ్యంతో మహి ళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అందులో భాగంగా మహిళలు ఆర్ధికంగా ఎదిగేందుకు గాను మహిళా సంఘాలకు విరివిగా రుణా లు అందించడం జరుగుతుందన్నారు. అంతేగాక ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళ పేరుతోనే మంజూరీ చేయడం జరుగుతుందన్నారు. మహిళ లు అభివృద్ధి చెందినప్పుడే దేశం బాగుంటుందని, ఇందుకుగాను ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహాకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్ధానా లకు చేరుకోవాలని ఆకాక్షిస్తు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రెడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సిద్దిలింగప్ప, హస్నాబాద్ సర్పంచ్ పకీరప్ప, బీఆర్ఎస్ యువజన విభాగం అద్యక్షులు నరేష్‌గౌడ్, బాకారం అరుణ్ కుమార్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

**త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువలకు టెండర్లు: ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కొడంగల్, నారాయణపేట్ నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు గాను కాలువల పనుల నిర్మాణా నికి వచ్చేనెల ఏప్రిల్‌లో ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను చేపట్టనుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్ధానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై సీఎం కేసీఆర్ స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో పథకం పనులు కొనసాగుతున్నాయని, కొడంగల్ నియోజకవర్గంలో 1లక్ష20వేల ఎకరాలకు సాగునీరు అందించే కాలువల పనుల నిమిత్తం మరో 20 రోజుల్లో టెండర్ల ప్రభుత్వం ప్రక్రియను చేపట్టేందు కు చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే డబుల్‌బెడ్ రూం ఇళ్ళ పథకంతో పాటు ఇంటిస్ధలాలు ఉన్న వారు ఇళ్ళు నిర్మించుకునేందుకు గాను రూ.3లక్షల మంజూరీ తదితర వాటిని త్వరలో జరుగనున్న మంత్రివర్గ క్యాబినెట్ సమావే శంలో సీఎం ప్రకటించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. అలాగే నియోజ కవ ర్గంలో పెండింగ్‌లో ఉన్న బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో ప్రభు త్వ జూనియర్ కళాశాలల మంజూరీతో పాటు కొడంగల్‌కు మంజూరైన 4 గురు కుల పాఠశాలల పక్కా భవనాల నిర్మాణాలతో పాటు కొడంగల్‌కు తిరిగి తరలించే విషయమై సీఎం దృష్టికి తీసుకువెళ్ళగా సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ మధు సుదన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సిద్దిలింగప్ప, నరేష్‌గౌడ్, రెడ్డి శ్రీనివాస్, బాకారం అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ మండల సమైఖ్య అధ్యక్షురాలికి అవార్డు


అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని వికారాబాద్ కలెక్టర్ కార్యలయంలో కలెక్టర్ చేతుల మీదిగా కోట్‌పల్లి బెస్ట్ మండల సమైఖ్య అధ్యక్షరాలుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న అధ్యక్షురాలు నిర్మల,

**కోట్‌పల్లి, మార్చి 8 ప్రభాతవార్త :**

కోట్‌పల్లి మండలంలో బ్యాంకు లింకేజ్‌కు సంబంధించిన రుణాలు 100 శాతం పూర్తికావడంతో బుధవారం నాడు అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో బెస్ట్ మండల సమైఖ్య అధ్యక్షురాలుగా నిర్మలకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సి నారాయణరెడ్డి చేతుల మీదిగా అవార్డు, తోపాటు ప్రశంస పత్రాన్ని తీసుకోవడం జరిగిందని ఎపీయం శివయ్య తెలపారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ. మండలంలో 100, శాతం రుణాలు టార్గెట్ పూర్తి అయిందన్నారు. ఈ టార్గె ట్ వికారాబాద్ జిల్లాలోనే 100 శాతం పూర్తి చేసిన మండలంగా కోట్‌పల్లి గుర్తింపు పోందిదన్నారు. మండలంలో మొత్తం నాలుగు అవార్డులు తీసుకో వడం జరిగిందని ఇందులో మొదటి బెస్ట్ మండల సమైఖ్య అధ్యక్షురాలుగా, బెస్ట్ సీసీ మహిళ, స్త్రీ నిధి ద్వారా 120, శాతం గ్రౌండింగ్ పూర్తి అయిం దన్నారు. బెస్ట్ యూనిట్ అయిల్ మిల్, ప్రతి విభాగాలలో మంచి ప్రగతి సాధించినందుకు గౌరవం దక్కిందని వారు పేర్కోన్నారు, ఈకార్యక్రమంలో సీసీలు బీమ్లానాయక్, హన్మంత్‌రెడ్డి, అంబుజ, గణేష్, సునీత, సంజీవ్ కుమార్, తదితరులు పాల్గోన్నారు,

## కరీంపూర్ గ్రామంలో రక్షణ సువార్త స్వస్థత ఉజ్జీవ సభ


కరీంపూర్ గ్రామంలో రక్షణ సువార్త సభకు హాజరైన ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను క్రైస్తవ సినారి అందజేస్తున్న బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సుందరి అనిల్,

**కోట్‌పల్లి, మార్చి 8 ప్రభాతవార్త;**

కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో మంగళవారం నాడు రాత్రి క్రైస్తవ సహదారులు నిర్వహించిన రక్షణ సువార్త స్వస్థత ఉజ్జీవ సభ కార్యక్ర మానికి వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు అనంద్ హాజరై అయన మాట్లాడారు. గ్రామంలో ఇలాంటి సువార్త సభ జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉంద న్నారు. ఈ సువార్తకు చుట్టు పక్క గ్రామాల నుంచి రావడం పెద్ద ఎత్తున సభ పెట్టడం అనందంగా ఉందని బైబిల్ గ్రంథంలో నా శాంతినే మీ కనుగ్ర హించుచున్నాను, మీ హృదయంను కలవరపడనియ్యకుడి అని గ్రంథంలో రాయడం మంచి వాక్యం అన్నారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో మీరే గెలుపోం దుతారని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్, జిన్నారం ఎంపీటీసీ బందయ్య, ప్రజాప్రతినిధులు నాయకులు, క్రైస్తవ సహదారులు, పాల్గోన్నారు.

# అక్రమంగా పొలంలోకి ప్రవేశించారు

**-ముడిమ్యాలలో వ్యవసాయ భూమిని గతంలోనే విక్రయిచారు**
**-అక్రమంగా ప్రవేశించలేదు...ఎవరిపై ద్రౌజన్యం చేయలేదు**
**-ముడిమ్యాలలో ద్రౌజన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**చేవెళ్ళ, మార్చి 8, ప్రభాతవార్త**

ముడిమ్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 164,165లల్లో సుమా రు 22.32 గుంటల భూమిలోకి పలువురు అక్రమంగా ప్రవేశించి ద్రౌజన్యం చేస్తున్నారని, ముడిమ్యాల గ్రామంలో పోలం వద్ద ద్రౌజన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చేందిన కావలి రమేష్, వెంకటయ్య, సత్త య్య, గోపాల్‌లు చేవెళ్ల పోలీసులకు బుదవారం పిర్యాదు చేశారు. ముడిమ్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 164,165లల్లో సుమారు 22.32 గుంటల భూమినిసాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇట్టిభూమిపై రాజయ్య, తాజ్ హెమద్ ఖాన్, కావలి రమేష్ బ్రదర్స్‌కు హై కోర్టులో కేసు ఎఎస్ 408/2005 పెండింగ్‌లో ఉందని, ఈ నెల 7వ తేదిన ఉదయం 11 గంటలకు చేవెళ్లకు చేందిన దేవర క్రిష్టారెడ్డి, మద్దెల నర్సింలు తదితరులు తమ పోలంలోకి అక్రమంగా ప్రవేశించారని, ద్రౌజన్యం చేసి జెసిబిలు, ట్రాక్టర్ లతో పోలంను దున్నారని, చంపుతామని బెదిరించారని, తమను బేదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. ముడిమ్యాలలో గ్రామంలోని సర్వేనంబర్ 164,165లల్లో సుమారు 22.32 గుంటల భూమిలోకి అక్రమం గా ప్రవేశించలేదని, ఎరిమీద ద్రౌజన్యం చేయాలేదని చేవెళ్లకు చేందిన దేవర క్రిష్టారెడ్డి, మద్దెల నర్సింలు తెలిపారు. ఎవరి పోలంలోకి అక్రమంగా ప్రవేశించ లేదని, అట్టి భూమిని కోనుగోలు చేశామని తెలిపారు. విక్రయించిన భూమిని సదరు పట్టాదారులు మళ్ళీ కబ్జా చేసి భూమిని కోనుగోలు చేసిన వారిని బేదిరిస్తున్నారని తెలిపారు. అట్టి భూమిని ముడిమ్యాల గ్రామానికి చేందిన కె.గోపాల్, సర్వేనంబర్ 164లో 3.10గుంటలు, కె.సత్తయ్య సర్వేనంబర్ 164లో 3.11గుంటలు, కె.రమేష్ సర్వేనంబర్ 164లో 3.11గుంటలు ముగ్గు రు కలసి మొత్తం 9.32 గుంటల భూమిని తాజ్ అగ్రో ఫామ్స్ లిమిటేడ్ కంపనీకి ఎజిపిఎ నంబర్ 4769/1998 తేది 14.10.1998 రోజున విక్రయిం చారు. ముడిమ్యాల గ్రామానికి చేందిన కె.గోపాల్, సర్వేనంబర్ 165లో 2..16గుంటలు, కె.సత్తయ్య సర్వేనంబర్ 165లో 2.17గుంటలు, కె.రమేష్ సర్వేనంబర్ 165లో 2.17గుంటలు, కె.వెంకటమ్మ సర్వేనంబర్ 165లో 4.00 ఎకరాల భూమిని నలుగురు కలసి మొత్తం 11.10గుంటల భూమిని తాజ్ అగ్రో ఫామ్స్ లిమిటేడ్ కంపనీకి సెల్‌డీడ్ నంబర్ 4774/1998 తేది 15.10.1998 రోజున విక్రయించారు. ముడిమ్యాల గ్రామ రెవెన్యూ పరిధి లోని సర్వేనంబర్ 164,165లో మొత్తం 21.02 గుంటల భూమిని తాజ్ అగ్రో ఫామ్స్ లిమిటేడ్ కంపనీ కోనుగోలు చేసిందని, కంపనీ కోనుగోలు చేసిన భూమిని తాము కోన్నామని తెలిపారు. భూమి విక్రయదారులు ఎజిపిఎ చేసిన తరువాత వారే మాత్రమే ఎజిపిఎను రద్దు చేసుకున్నారని, ఎజిపిఎ చేసిన తరువాత ఇరు పార్టీల వారు కలిసి రద్దు చసుకుంటేనే ఎజిపిఎ రద్దు జరుగు తుందని, కంపనీ పెరు మీద కోనుగోలు చేసిన భూమికి పాసుపుస్తకాలు రావ ని, ధరణిలో విక్రయ దారుల పెర్లు ఉండటంతో విక్రయించిన భూమిని మళ్లీ కబ్జా చేశారని తెలిపారు. ఇలా ఇరువర్గాలు భూమి తమదంటే తమదని గోడవ పడుతూ పోలీస్ స్టేషన్‌ను అశ్రయించారు. తమభూమిలోకి అక్రమంగా ప్రవేశిం చిన వారిపై చర్యలు తీసుకోవాలని కావలి రమేష్, వెంకటయ్య, సత్తయ్య, గోపాల్‌లు పిర్యాదు చేయగా తాము అక్రమంగా ప్రవేశించలేదని చేవెళ్లకు చేందిన దేవర క్రిష్టారెడ్డి, మద్దెల నర్సింలు తమ వాదనలు వినిపిస్తున్నారు. పోలీసులు పూర్తి స్ధాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఇరు పార్టీలు కోరుతున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని అరికట్టాలంటే ఏవిఎన్‌రెడ్డిని గెలిపించాలి

**.బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్**


ఇందూరులో ప్రచారం నిర్వహిస్తున్న భాజపా నాయకులు

**పెద్దేముల్, మార్చి 8, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని అరికట్టాలంటే ఏవిఎన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి యు.రమేష్‌కుమార్ పిలుపునిచ్చా రు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా బుదవారం పెద్దేముల్ మండలం లోని ఇందూరు ఉన్నత పాఠశాలలో భాజపా నాయకులతో కలిసి ఆయన ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్బంగా యు.రమేష్‌కుమార్ మాట్లాడుతూ తెలం గాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నుంచి పోటిచేస్తున్న ఏవిఎన్‌రెడ్డికి బిజేపి పూర్తి మద్దతు ప్రకటించి గెలిపించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ద్వారా సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యా యలు, ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వారి గోస వినిపించుకునే పరిస్థితులో రాష్ట్ర ప్రభుత్వంలేదని అన్నారు. 317 జిఓను తీసుకొచ్చి వారిని సుదూర ప్రాంతాలకు బదిలి చేసిన సమయంలో కనీసం ఉపా ధ్యాయ సంఘాల, అభ్యర్ధుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారు ణమని అన్నారు. దీనిపై బిజేపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. ఇటువంటి సమయంలో మేధావి వర్గమైన ఉపాధ్యాయులు సరైన నిర్ణయం తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ప్ర జా వ్యతిరేక పోకడలను కట్టడి చేయడానికి ఏవిఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజేపి పార్టీ అధ్యక్షులు సందీప్‌కుమార్, బిజేవైఎం నాయకులు రమేష్ సాగర్, ప్రదీప్, నరేష్, ఉపాధ్యాయులు అంజయ్య, ఆనంద్, జి.నర్సిములు, విజయానంద్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశం, అనంతనర్సింహ, అంబదాస్, శ్రీనివాస్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో సేవకు మారుపేరు మహిళలే


సన్మానిస్తున్న మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత.

**తాండూరు, మార్చి 8, ప్రభాతవార్త:** ప్రపంచంలో సేవకు మారుపేరు మహిళలే అని, మహిళలు ఆత్మస్థైర్యంతో ముందకు సాగాలని బిజెపి వికారాబాద్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురష్కరించుకొని మహిళా మోర్చా ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయం లో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వికారాబాద్ అమ్మ మహిళా వసతి గృహం నిర్వాహకురాలు వజ్రమనితో పాటు సుమారు 500పైగా ఉచిత ప్రసవాలు చేసిన నర్సమ్మ, రత్నమ్మలను ఘనంగా సన్మానించారు. వారి సేవలకు సుస్మా స్వరాజ్ అవార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రపంచంలో సేవకు మారుపేరు మహిళలేనని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యు. రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు మనోహార్ రావు, మురళీకృష్ణగౌడ్, పటేల్ విజయ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ లావ ణ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుజాత, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమాదేవి, రేణుక, శృతి, ఆర్తీ, జ్యోతి పాల్గొన్నారు.

**పరిగి పట్టణంలో :** పరిగి మార్చి8, ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగా ల్లో రాణించాలని పరిగి ఎమ్మెల్యే సతీమణి ప్రతిమా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగి పట్టణంలోని శారద ఆసుపత్రిలో ఏర్పాటు కార్యక్రమాన్ని హాజరై కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడు తూ..మహిళలు అన్ని రంగాలలో ముందుకు రాణించాలని ,పరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమలో ముందుంటానని మహిళలకు అన్ని పథకాలు అందేలా అందరికీ వచ్చేలా అందరకీ న్యాయం చేస్తానని అన్నా రు. ఎప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ప్రతిమా రెడ్డి

## కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో
# డయాల్సిస్ సేవలు ప్రారంభం

**కొడంగల్, మార్చి 8 ప్రభాతవార్త**

కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం డయాల్సిస్ సేవలు ప్రారంభమై య్యాయి. గతకొన్ని నెలల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హారీష్‌రావు డయాల్సిస్ కేంద్రాన్ని ప్రారంబించినా పూర్తి స్ధాయిలో పరికరాలు అందు బాటులో లేకపోవడంతో డయాల్సిస్ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ క్రమంలో ఇటీవలే ఈ ప్రాంత డయాల్సిస్ రోగులు ఎమ్మెల్యే పట్నం నరేంద ర్‌రెడ్డితో పాటు ఇటీవలే ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిల దృష్టికి తీసుకువెళ్ళడంతో వారం రోజుల్లో డయాల్సిస్ సేవలు ప్రారంబించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారుల్లో చలనం రావడంతో పాటు కొత్తగా వచ్చిన యంత్రాలతో బుధవారం మొదటి సారిగా డయాల్సిస్ సేవలను ప్రారంబించారు. ఈ సందర్బంగా కేంద్రం నిర్వహకులు మాట్లాడుతు ఒక్కో పేషెంట్‌కు డయాల్సిస్ చేసేందుకు 4 గంటల సమయం పడుతుందని అన్నారు. ఒక రోగికి నెలకు 8 సార్లు డయా ల్సిస్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కొడంగల్‌లో ఏర్పాటు చేసిన డయా ల్సిస్ ద్వారా 25 మంది వరకు సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాల్సిస్ చేయాలంటే ఒకక్కసారికి రూ.2500 వరకు ఖర్చు వస్తుందని, ఒకపై ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పొందవచ్చని తెలిపా రు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ కేవీఎన్.మూర్తి, ప్రబుత్వ వైద్యులు డాక్టర్ సాకేత్, నిర్వహకులు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రిలో డయాల్సిస్ సేవలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ వైద్యులు

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**అడ్డగుట్ట, మార్చి 8 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక,రాజకీయ విద్యా, ఉద్యోగ రంగాలలో ముందంజలో నిలువాలని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 5వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నేత పెద్దాల శారధ నర్సింహ్మల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లి లోని నెహ్రూనగర్ పార్కులో ఏర్పాటు చేసిన వేడుకలకు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు ముప్పిడిమధుకర్,పెద్దాల శారధ, గురు తదితరులు పాల్గొన్నారు.

**కంటోన్మెంట్‌లో...**

**కంటోన్మెంట్,మార్చి 8 ప్రభాతవార్త:** స్త్రీ తలచుకుంటే ఏదైనా సాధించ గలుగుతారని శ్రీగణేష్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్,కంటోన్మెంట్ ప్రముఖ నాయకుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్‌లోని రీసాల బజార్, లాల్‌బజార్, గాంధీ నగర్, ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా శక్తి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శ్రీగణేష్ బహుమతులు అందజేశారు.

**మెహిదీపట్నంలో...**

**మెహిదీపట్నం, మార్చి 8, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం కార్వాన్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన వేడుకల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని కేకలను కట్‌చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపి వారికి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. గుడిమల్కాపూర్ డివిజన్ శ్రీకృష్ణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆపార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం ఠాకూర్ జీవన్‌సింగ్ మహిళలకు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మహిళలు లేనిదే ఈ సృష్టి లేదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కోదూరు శ్రీదర్‌సాగర్, పట్లూ రఘు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**బిఎస్‌పి ఆధ్వర్యంలో...**

**మెహిదీపట్నం, మార్చి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని బహుజన సమాజ్ పార్టీ నాంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కేశపోగు చింతలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్ సంతోష్ నగర్ పార్కులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్, ఆశావర్కర్లకు శాలువాలుకప్పి ఘనంగా సన్మానించారు. కేశపోగు చింతలయ్య మాట్లాడుతూ..పురుషులతో సమానంగా అన్నిరంగాలలో రాణిస్తూ తమసత్తా చాటున్న మహిళలను అభినంధించాలన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాంపల్లి నియోజకవర్గ ట్రెజరర్ జి. బాలయ్య, మెహిదీపట్నం డివిజన్ నాయకులు మాణిక్యం నాయకులు శ్రీనివాస్‌లు మహిళలు పాల్గొన్నారు.

**గోషామహల్‌లో...**

**గోషామహల్, మార్చి 8 ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక రంగా, సామాజికంగా, విద్యాపరంగా,అభివృద్ధి చెందినప్పుడే అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ అన్నారు. బుధవారం ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్‌హైదరాబాద్ జిల్లా దండోరా అధ్యక్షులు పి.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివివేకనంద నగర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేశారు.అనంతరం పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడి టీచర్, ఆశావర్కర్లుకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఎంపి.సదానంద్, దండోరా నాయకులు పి.గోపాల్, యు.శ్రీనివాస్, కె.సాయికుమార్‌మాదిగ, ఓ.కిషన్, కె.సందీప్, గాలయ్య, జె.నాగరాజు, ఎం.ప్రభాకర్, పి.మహేందర్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

**బేగంబజార్‌లో...**

**బేగంబజార్, మార్చి 8 ప్రభాతవార్త:** మహిళా దినోత్సవం మహిళలకు మాత్రమేకాదని, పురుషులు కూడ మహిళలకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించి వారి పురోభివృద్ధికి తోడుడ్పిన నాడే మహిళా దినోత్సవానికి అసలు సిసలైన సార్థకత లభిస్తుందని గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రపంచ మహిళా దినోత్స వేడుకల్లో ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ఆలోచన ధోరణి మారినప్పుడు మహిళలు పురోగమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పూజిత, పూజ, సంజన, కీర్తి, ప్రవల్లిక, శివాణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

**యూనస్‌గూడలో...**

**యూసుఫ్‌గూడ, మార్చి 08, ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు పోటీ పడుతూ ఉన్నతంగా సమాజంలో గొప్ప స్థానాన్ని చేరుకోవడం జరిగిందని కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద నగర్‌లోని శ్రీసాయి చైతన్య పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనువాస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను, పాఠశాల 24 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటపాటలతో నాటికలతో అలరించారు. ఆటలు, వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విజేతలకు కార్పొరేటర్ బహుమతులను ప్రశంస పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయురాలందరిని శాలువలతో, పుష్పగుచ్చాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

**జనసేన ఆధ్వర్యంలో...**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జనసేనపార్టీ కేంద్ర కార్యాలయంలో ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌గౌడ్ పిఎసి సభ్యులు అర్హంఖాన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగంలు మహిళలకు శాలువలతో పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. మహిళల గొప్పతన్నాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో ఎమ్.కావ్య, శిరీష, రత్న, సునీత, స్వాతిరెడ్డి, సుజాత, ప్రభావతి, జయకళ్యాణి, వెంకటలక్ష్మీ, ముంతాజ్, దాక్షాయని, పద్మజ, వాసవి, శ్రావణి, అనూష, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

**సృష్టికి మూలం మహిళలే : ఎమ్మెల్యే ముఠాగోపాల్**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** సృష్టికి మూలం మహిళలేనని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక వార్డు కార్యాలయంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లను, పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, డివిజన్ నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, మారిశెట్టి నర్సింగరావు, పున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, మాచర్ల పద్మజ, పోతుల శ్రీకాంత్, రవిశంకర్‌గుప్త, గుండు జగదీశ్, జి.వెంకటేశ్, ఎం.దేవయ్య, గడ్డమీది శ్రీనివాస్, మల్యాల సురేశ్,వనజ, శివకుమారి, స్వరూప, మంజు, అర్చన, భాగ్య, సుధా, సత్య, ప్రవీణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో...**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి హాజరై మహిళా కానిస్టేబుళ్ల, హోంగార్డులను ఈ సందర్భంగా సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్, డిఐ పి.నరేశ్, డిఎస్ఐ కె.శిశుపాల్‌రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ కె.వెంకటరమణ, ఎస్ఐలు సిహెచ్.నాగరాజు, ఎ.సందీప్‌రెడ్డి, జె.కిరణ్‌కుమార్, సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, పి.అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్‌లో...**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని స్థానిక వివి.గిరినగర్ కమ్యునిటీ హాల్‌లో కంటి వెలుగు మహిళా సిబ్బందిని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు తులసీ, విజయలక్ష్మి, మంగమ్మ, సంధ్యారాణి, పూర్ణ, సుహాసిని తదితరులుపాల్గొన్నారు. గృహిణిగానే కాకుండా వ్యవసాయం నుంచి మొదలుకుని దేశ సరిహద్దులో రక్షణ వరకు అంతరిక్ష ప్రయోగాలలో విజయాలు సాధించే వరకు మహిళలు నిర్వహిస్తున్న పాత్ర గణనీయమైందని అన్నారు.

**అఫ్జల్‌గంజ్‌లో...**

అఫ్జల్‌గంజ్,మార్చి 8ప్రభాతవార్త: మహిళలకు సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం ఇచ్చినప్పుడే సమాజం అభివృద్ది చెందుతుందని అధిత్యచారి ట్రుబుల్‌ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు నందకిషోర్ వ్యాస్(బిలాల్)అన్నారు.బుధవారం ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోషామహల్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్మిక మహిళలను శాలువ కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున్న మహిళలు పాల్గొన్నారు.



చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఏసీపీ యాదగిరి, సిఐ ఎన్.సంజయ్‌కుమార్

**కవయిత్రులు, రచయిత్రులకు పురస్కారాల ప్రదానం**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** సాహితీ జిగీష, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళావేంకట దీక్షితులు కళావేదికలో వివిధ రంగాలకు చెందిన కవయిత్రులు, రచయిత్రులను సత్కరించి అభినందించే కార్యక్రమం లలిత పరమేశ్వరి నిర్వహనలో జరిగింది. ముఖ్యఅతిథులుగా కమలాకర లలిత కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కమలాకర భారతి హాజరై సాహిత్య, సంగీత, నాట్య, వైద్య, రచన, పత్రికారంగానికి చెందిన వారిని సత్కరించారు. పి.విజయలక్ష్మి(సాహిత్యం),ఎం.భారతి(సంగీతం), బి.దివ్య(నాట్యం), డాక్టర్ పి.స్రవంతి(వైద్యం), గోళ్ళమూది పద్మావతి(రచనా వ్యాసంగం), వి.నాగరత్న(పత్రికారంగం)లను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వి.ఉమాశశి తదితరులు పాల్గొన్నారు. ఏకపాత్రాభినయం–రుద్రమదేవి పాత్రను ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుకల్చరర్ పి.జ్యోతి చేయగా పద్యపఠనాన్ని డాక్టర్ పి.లలితవాణి, బి.లీలావతి, పి.జ్యోతి, బి.కృష్ణవేణి అద్భుతంగా నిర్వహించారు.

**మహిళలే మహరాణులు పురస్కారాల ప్రదానం**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** మహిళలే మహరాణులు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ అధినేత డాక్టర్ ఆలూరి విల్సన్, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎన్.ఇందిర, జ్యోతిఆర్ట్స్ ఫౌండేషన్ ఆర్గనైజర్ ఆర్.జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక, సాహిత్య, గాన కళారంగాలలో విశిష్ట సేవలందించిన మహిళామణులకు ఈ సందర్భంగా పురస్కారాలను ముఖ్య అతిథులుగా వంశీసంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, ప్రముఖ గాయకుడు జిఎస్.శ్రీనివాస్, డాక్టర్ పసుమర్తి రామలక్ష్మి, హెచ్‌విఎస్.రామలక్ష్మి, సంఘసేవకురాలు అంజనీకుమారిలు హాజరై వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించారు.

**'ఝాన్సీ లక్ష్మీబాయినారీశక్తి పురస్కారాలు'**

**చిక్కడపల్లి, మార్చి 8 ప్రభాతవార్త:** కళాదర్బార్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఝాన్సీ లక్ష్మీబాయి నారీశక్తి పురస్కారాలు' ప్రదానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి నిర్వాహక సంస్థ అధినేత కళాసామ్రాట్ రంగారావు ఆధ్వర్యంలో జరిగింది. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని సమావేశ మందిరంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా వంశీ సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు, వాసవీ గ్రూప్స్ డైరెక్టర్ రావుల వెంకటేశ్వరరావు, జిల్లా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ అధికారి డి.చక్రపాణి, మధురగాయనీ సురేఖామూర్తి, సింగింగ్ స్టార్ విజయలక్ష్మి, గాయనీ శశికళాస్వామి, డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్‌లు పాల్గొని పురస్కారాలను అందించారు. ప్రముఖ కవి, కళారత్న బిక్కి కృష్ణ, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, సురేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. పురస్కారాలు అందుకున్న వారిలో నటి సన, వేణువాయిద్య నిపుణులు జయప్రద, వ్యాఖ్యాత్రి ఆశాలత, న్యాయవాది శ్రీదేవి, బాక్సింగ్ ఛాంపియన్ దివ్య తదితరులున్నారు.



ఈసీఈ భవనానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, ఐఎఎస్ అధికారి శ్రీధర్ తదితరులు

## ఒయు అభివృద్ధికి తోడ్పడటం సంతోషంగా ఉంది

### సింగరేణి ఎండి శ్రీధర్

**తార్నాక, మార్చి 8 ప్రభాతవార్త:** తాను చదివిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పడటం ఎంతో సంతోషంగా ఉందని సింగరేణి ఎండి ఐఎఎస్ అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. కార్పోరేట్ సామాజిక భాధ్యత కింద సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆద్వర్యంలో రూ. 1.2 కోట్లతో ఈసీఇ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం) నూతన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ భవన సముదాయం శంకుస్థాపన కార్యక్రమంలో బుధవారం ఓ.యూలోని ఈసీఈ ఆవరణలో నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, సింగరేణి సీఎండి ఎన్.శ్రీధర్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్‌తో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం ఎండి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రఖ్యాత ఓ.యూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తరగతి గదులు ఉండాల్సిన అసరం ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలతో నూతన భవనం ఎక్కువ కాలం ఉండే విధంగా చూస్తామన్నారు. తాను చదివిన ఓ.యూకు సింగరేణి ద్వార చేయూత నివ్వడం ఎంతో సంతోషాన్ని కల్గిస్తుందన్నారు. చదువుకున్న విశ్వవిద్యాలయానికి తిరిగి ఇచ్చే సంస్కృతి ఎంతో మందిని ఉత్తేజపరుస్తుందని ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. సీఎండీ శ్రీధర్ ఓ.యూను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ నూతన భవనం రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. 2024 విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకోస్తామని వెల్లడించారు. ఓ.యూ పురోభివృద్ధిలో కీలక భూమిక పోసిస్తున్న అలుమ్నీ అసోసియేషన్ కృషి ఎంతో గొప్పదన్నారు. సింగరేణి కాలరీస్ నుంచి విరాళాలు అందించిన ఎండి శ్రీధర్‌కు ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల సంఘం తరుపున డా. విజయ్ దేవరకొండ కృతజ్ఞతలు చెప్పారు.కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి ప్రొ.ఎల్.నిర్మలా దేవి, సీనియర్ ప్రొపెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## హోలీ సంబరాల్లో మంత్రి తలసాని

**కంటోన్మెంట్,మార్చి 8 ప్రభాతవార్త:** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మోండా మార్కెట్ డివిజన్ బండి మెట్టు, పి.వి.మార్క్ పీపుల్స్ ప్లాజా, సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన హోలీ వేడుకలకు రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని యువతకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగులు బండి మెట్టులో నిర్వహించిన వేడుకల్లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆటపాటలతో నిర్వహించిన డ్యాన్స్ వేడుకల్లో మంత్రి తలసాని పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో మంత్రి తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు నాగులు, ఆకులహరికృష్ణ తదితరులు


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నెం.58/DIV-13 (పాత-7B)/GHMC/2022-23, పని పేరు: సివిల్ పనులు (03 నెం.లు), అంచనా విలువ: రూ.56.00 లక్షలు, బిడ్ల స్వీకరణకు (ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయము: 09.03.2023న సా.4.00 గం.లు, 16.03.2023న సా.4.00 గం.లు, అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్ నెం.13, (పాత-7B), (KZ), GHMC, ఖైరతాబాద్, హైదరాబాద్, 9154960552. తదుపరి వివరములను www.tender.eprocurement.gov.in పై చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్ నెం.13, (పాత-7B), GHMC

DIPR.No.13124-PP/CL/Advt/1/2022-23, తేది: 08.03.2023


## బోర్డు ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి

**కంటోన్మెంట్,మార్చి 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో 5వ వార్డుకు చెందిన ఉద్యమ కారులకు టికెట్లు కెటాయించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ కారులు బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి,బిఆర్ఎస్ నేతలు ఎం.షర్విన్, కిరణ్ కుమార్, పెంట శ్రీహరి, చొల్లేటి రమేశ్, భాస్కర్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

## కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరుతామన్న శ్యామ్‌న్‌రాజు

**కంటోన్మెంట్,మార్చి 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌సన్ రాజు పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరుతున్నట్లు తెలిపారు. బుధవారం 2వ వార్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్యామ్‌సన్ రాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిజెపి పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే బోర్డు ఎన్నికల్లో కంటోన్మెంట్‌లోని 8వ వార్డులు బిజెపి కైవసం చేసుకునే విధంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## హోలీ సంబరాల్లో జంపనప్రతాప్

**కంటోన్మెంట్, మార్చి 8 ప్రభాతవార్త:** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లిలోని సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన హోలీ సంబరాల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు జంపనకు రంగులు చల్లి శుభాకాంక్షలు తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ **I, MOHAMMED SHAHZAM QUADRI,** R/o.23-3-372/A/1, Near Water Tank, Moghal pura, Charminar, Hyd-02, Changed Name As **MOHAMMED OMER QUADRY S/o. MOHAMMED NIZAMUDDIN.**

★ **I. MOHAMMED NIZAMUDDIN QUADRI,** R/o.H.No.23-3-372/A/1, New Water Tank, Moghalpura, Hyd-02, Changed My Name As **MOHAMMED NIZAMUDDIN.**

(Ro.No. 061621)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**PUBLIC NOTICE**

**TO WHOM IT MAY CONCERNED-**
It is hereby informed that property link document - Rectification Deed bearing document number **1869 of 2007, dated 15/05/2007,** registered at SRO Banjara Hills, Hyderabad has been lost on **20/02/2023** during commute. General public hereby cautioned not deal or carry out any transaction on the basis of said missing document. If any person does so, will be doing at their own risk and that our client will not be liable for the consequences arising thereof. If found kindly contact under signed.

**BHASKAR MUTHYALA**
**Advocate**
**M/s. ADSUM LAW FIRM LLP**
#104, 1st Floor, Priyanka Residency, Kapra, Sainikpuri, Secunderabad-500 094.
**Cell: 7093140121**

**FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES**
**(Order V Rule 3 & 5)**
**IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE**
**CITY CIVIL COURT : AT HYDERABAD**
**O.S. NO. 4818 OF 2022**
Between:
**M.Srinivas Kumar @ Vasu ...Plaintiff**
AND
**Smt. M. Mangamma ...Defendant**
To,
**Smt. M. Mangamma**
W/o Late M. Raj Kumar
Age: 55 years, Occ: Housewife
Presently R/o H.No.18-6-1136,
O/s Gowlipura, Hyderabad.500053
WHEREAS the plaintiff has instituted a Suit against you before the above Court, seeking for Decree of Declaration. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or you shall be accompanied by some person able to answer all such questions on the **27th day of March 2023 at 10:30** O' clocks in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this Summon a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence.
TAKE notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.
//By Orders of the Court//
**M/s. NARESH AGARWAL**
**Advocate & Associates**
**Counsel for Plaintiff**
H.No.9-6-217, Durga Bhawani Nagar, Santhosh Nagar, Hyderabad, T.S., **Ph: 9121706465**

**IN THE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-III ADDL. METROPOLITAN MAGISTRATE: R.R. DISTRICT, AT : L.B.NAGAR**
**O.S. No. 77 OF 2023**
Between:
**Verabhomma Satyanarayana and others ...Plaintiffs**
AND
**The Tahasildar, Saroornagar Mandal and another ...Defendants**
To,
**All Concerned ...Defendant No.2**
Please take notice that the above named Plaintiffs have filed the above suit against the Defendants for Declaration to declare the Plaintiffs are the legal heirs and successors of late Smt. V. Lakshmamma in respect of the suit schedule property mentioned here under and same is posted to 04.04.2023 for objections of the Defendant No.2. If any person or persons have any objection, right, claim, title or interest over the suit schedule property on behalf of the Defendant No.2 may appear before the above mentioned court on 04.04.2023 at 10.30 A.M. through person or their advocate, otherwise the Hon'ble Court may be pleased to pass an appropriate order in the above case.
**SCHEDULE PROPERTY**
All the part and parcel of the Open Plot No.11, Adm.107 Sq.Yards G+1 out of Adm.264 Sq.Yards or 220.7 Sq.Mtrs in Survey No.59, Situated at Karmanghat Village, Saroor Nagar Mandal, R.R. Dist (OLD) Presently House bearing No.8-7-90/11, Teachers Colony, Hasthinapuram South, R.R.District is Bounded by: North: Panchayat Road, South: Plot No.10, East: K.Prameela (Co-Owner of Plot No.11), West: 30" Wide Road.
(BY ORDER OF THE COURT)
**P. KAMALAKAR,**
**B. MADHUSUDHAN RAO**
**Advocates**
# 1-1-475/2/1, Gandhinagar, New Bakaram, Hyderabad.
**Cell No.98850 43415**


## మల్లికార్జునచారి మృతి పార్టీకి తీరని లోటు

**యూసుఫ్‌గూడ, మార్చి 8, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమంలో ఎంతో ప్రముఖ పాత్ర పోషించి తన వంతు పార్టీ కోసం పనిచేసిన నాయకుడు మల్లిఖార్జున చారి అనీ ఆయన మృతి... పార్టీకి తీరని లోటు అనీ డివిజన్ యువజన విభాగం అధ్యక్షులు దేవిరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. గత కొద్దిరోజుల క్రితం కాలనీలో మృతిచెందిన మల్లిఖార్జున చారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆయన కుటుంబానికి తమ వంతు అండగా నిలిచేందుకు కాలనీ వాసులతో పాటు పలువురు ఉద్యమ కారులు వారికి తోచినంత ఆర్థిక సహాయాన్ని అందజేయగా అందుకు సంబందించిన దాదాపు రూ.39వేలను మల్లిఖార్జున చారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆవుల ఆంజనేయులు, రవి ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.2808 of 2019**
**Between:**
Canara Bank, Afzalgunj Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Sri M.Srinivas and another
**Defendant-1**
To
1. Sri M.Srinivas, S/o M. Balaiah, aged about 44 years, Occ: Business, R/o. H.No.13-3-396/A/9/B, Sai Durganagar, Jiyaguda, Hyderabad-500006.Ph.No. :9848409009.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.1,49,288/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **29th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.3389 of 2021**
**Between:**
Canara Bank, I S Sadan Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Smt Podila Sabitha
**Defendant**
To
1. Smt. Podila Sabitha, W/o. P.Manohar, aged about 41 years, Occ: Business, Represented by its sole Proprietor M/s Sabitha Sarees, R/o. 16-1-362, Poosala Basthi, Saidabad, Hyderabad- 500059. Ph.No.7702184737.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.2,00,075/-** to gether with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **17th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.3552 of 2022**
**Between:**
Canara Bank, Abids Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Mr.Mohammed Mufeed and another
**Defendants**
To
1. Mr.Mohammed Mufeed, S/o. Mohammed Samad, aged about 30 years, Occ: Driver, R/o. Block No.28, Flat No.3, MCH Colony, Amberpet, Hyderabad-500013. Ph.No.9700065502.
2. Mr.Mohammed Akbar Ali, S/o. Mohammed Asgar Ali, Aged about 39 years, Occ: Business, R/o. 9-4-51/8, Hakeempet, Tolichowki, Hyderabad- 500008.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.5,86,886/-** to gether with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **17th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE VII SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.22 of 2018**
**Between:**
Canara Bank, Somajiguda Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Sri A.Raghavender
**Defendant**
To
Sri A.Raghavender, S/o. A.Chandraiah, aged about 33 years, R/o. H.No.129/A, Vidya nagar Colony, Chandanagar, R.R.Dist.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,72,684/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **20th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE VII SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.23 of 2018**
**Between:**
Canara Bank, Somajiguda Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Sri Kala Jojappa
**Defendant**
To
Sri Kala Jojappa, S/o K.Ennaiah, aged about 43 years, Occ: Driver, R/o. H.No.11-3-64/63, Parsigutta, Sec'bad. And H.No.6-1-21, Dharmapuri Village, Maha bubnagar.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,72,874/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **20th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI COURTS AT MALKAJGIRI**
**O.S.No.382 of 2021 (N)**
**O.S.No.2627 of 2019 (O)**
**Between:**
Canara Bank, Sainikpuri Branch, R.R.Dist.,
**.... Plaintiff**
**And**
Sri Arasani Dinesh Kumar and another
**Defendants**
To
1. Sri Arasani Dinesh Kumar, S/o. A.Gopi, aged about 32 years, Occ: Driver, R/o. H.No.38-106/C, Street No.1, Ambedkar Nagar, Malkajgiri, Sainikpuri, Secunderabad- 500094. Ph.No.9553856108.
2. Smt A.Saraswathi, W/o. A.Gopi, aged about 54 years, R/o. H.No.38-106/C, Street No.1, Ambekar Nagar, Malkajgiri, Sainikpuri, Secunderabad- 500094. Ph.No.9551385618.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.4,84,387/-** to gether with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **14th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

**IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD.**
**O.S.No.1410 of 2017**
**Between:**
Canara Bank, Somajiguda Branch, Hyderabad
**.... Plaintiff**
**And**
Sri P.Krishna Rao
**Defendant**
To
Sri P.Krishna Rao, S/o. P.Veeraiah, aged about 51 years, R/o. P.No.62 & 69, Adithyanagar, Mothi Nagar, Hyderabad and R/o. H.No.4-10-116, Vijay Nagar, Sanga Reddy, Sanga Reddy.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,66,357/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **17th March, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/-N.VENUGOPALA RAO,**
Advocate
1-2-234/2/1, Plot No.2/P Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
**Ph:98492 64568**

# మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి: మంత్రి సబితారెడ్డి



మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** నేటి సమాజంలో ఎటువంటి అడ్డంకులు ఎదురైనా వాటిని మహిళలు ఆత్మస్థైర్యంతో అధిగమిస్తూ ముందుకు సాగాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని తీగల సత్యనారాయణరెడ్డి ప్రాంగణంలో కార్పొరేషన్ బిఆర్‌ఎస్ మహిళాధ్యక్షురాలు పద్మారెడ్డి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారనే నమ్మకం కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందనే ఈ నేపథ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరుగుతుందని వెల్లడించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి వారికి చిన్నపాటి యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా మహిళలు ముందుకు వెళ్లడానికి ప్రభుత్వం భరోసా కలి స్తుందన్నారు. అనంతరం ఆమె మహిళా కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యురాళ్ళు, మహిళా పోలీసులు, వైద్య ఉద్యోగినిలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల నాయకురాళ్లు, కార్పొరేషన్ మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్, బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మహిళా కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యురాళ్లు, గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, లలితా జగన్, సుర్వి లత శేఖర్‌గౌడ్, తుమ్మల నిర్మలారెడ్డి, బిక్షపమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలి



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న మోహన్‌రెడ్డి, హర్షలత

**ఎల్.బి.నగర్, మార్చి 8 ప్రభాతవార్త :** తెలంగాణలో మహిళలపై రోజురోజుకు దాడులు అత్యాచారాలు పెరుగుతున్నాయని వారిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ రంగారెడ్డి జిల్లా ఎడమ మోహన్‌రెడ్డి, జిల్లా మహిళాధ్యక్షురాలు తమలపాకల హర్షలత పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని బిజెఆర్ భవన్ వద్ద తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో మహిళ సాధికారత సమానత్వం కోసం పోరాటం చేస్తామన్నారు.కార్యక్రమంలో స్వర్ణ, శిరీషచౌదరి, శకుంతల, లక్ష్మి, సునీత్, చైతన్య, నిర్మలరెడ్డి. హజ్రా పాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు..

**జవహర్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో నూతన పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని జవహర్‌నగర్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ నాగమణి పేర్కొన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా గీతాంజలి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ క్రిష్ణవేణి, ఇంద్ర, సవిత, గున్న సంధ్య, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : డిసిపి సాయిశ్రీ



సమావేశంలో ప్రసంగిస్తున్న డిసిపి సాయిశ్రీ తదితరులు

**మలక్‌పేట, మార్చి 8 ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డిసిపి సాయిశ్రీ పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ అనిబిసెంట్‌కళాశాలలో మహిళా దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిపి సాయిశ్రీ హాజరై మాట్లాడుతూ మహిళలందరికీ పురుషులతో సమానంగా హక్కులు ఉండాలని మహిళలు ఏ రంగంలోనూ తీసిపోరని తెలిపారు. ఎటువంటి విషయమైన, సంఘటనలైన ఇంట్లో అమ్మకు తెలియజేయాలని దీంతో భద్రత ఉంటుందన్నారు. మన ఫోన్‌ను మన అభివృద్ధికి ఉపయోగ పడేలా ఉండాలని అనవసర విషయాలకు తావివ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఓయు మాజీ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ లక్ష్మి, కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వీణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



హయత్‌నగర్‌లో కేకు కట్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

**హయత్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో కేకును కట్ చేయించి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ప్రతినిధులు ఎర్ర రవీందర్, పారదస్వామి మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులు నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారి శ్రమకు తగిన గుర్తింపును ఇవ్వడ లేదని, వారికి అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు యాదమ్మ, కృష్ణమ్మ, భాగ్యలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

**రావినారాయణరెడ్డి కాలనీలో...** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామం రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3 లోని భూపోరాట కేంద్రంలో మహిళా దినోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించారు. 47 రోజులుగా కొనసాగుతున్న భూపోరాటంలో భాగంగా మహిళలు కేకును కోసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు కాటి అరుణ, వట్టి నవనీత, దీపిక, సుభద్ర, శ్రీదేవి, చందన, సుజాత, దేవమ్మ, అనూష, లక్ష్మి శివరంజని, క్రాంతి పాల్గొన్నారు.

## ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు ప్రముఖ మహిళలకు ఘన సన్మానాలు



మహిళలను సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి, కమలాసుధీర్‌రెడ్డి

**మన్సూరాబాద్,మార్చి 8 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బినగర్ డిసిపి సాయిశ్రీ హాజరై మాట్లాడుతూ కట్టుబాట్లు, సాంప్రదాయలను కాపాడుకుంటూ ఆత్మవిశ్వాసమే ఆకాశం హద్దుగా మహిళలు ఎదిగి అన్నిరంగాలలో విజయం సాధించాలన్నారు. పురుషులతో పాటు సమానంగా చివరకి దేశ భద్రతలో సైతం తుపాకీలు పట్టుకుని గస్తీ తిరుగుతున్న మహిళామణుల కృషి మరవలేనిదని పేర్కొన్నారు. మహిళలు ఎప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే సందేశాలపై అవగాహనకల్పించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ట్రస్టు చైర్మన్ కమలాసుదీర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు సంస్కారం నేర్పుతూ వారికి సరైనా బాధ్యతలు చెప్పాల్సింది తల్లిదండ్రులేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాలలో ప్రముఖులైన పద్మశ్రీ పద్మాజారెడ్డి, తిరుపతమ్మ, సంధుయాదవ్, అఖిలనాయక్, మాధవి, డాక్టర్ చంద్రకళ, వీరమణి, స్రవంతి, ఈశ్వరమ్మయాదవ్, సుష్మా, సంగీత, సుజాతనాయక్, సుభాషిణి వంటి మహిళలను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళలు బతుకమ్మ ఆటలు, బోనాలు, గిరిజన సాంప్రదాయ నృత్యాలు, కూచిపూడి నృత్యాలతో ఆహుతులను అలరించారు.

## అన్ని రంగాల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యం

**తుర్కయంజాల్, మార్చి 8 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ రైతు సేవా సహకార బ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ కెసిఆర్ సర్కార్ మహిళలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**తుర్కయంజాల్, మార్చి 8 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలో 774 సర్వే నెంబర్ గల నాలుగు ఎకరాల 21 గుంటల ప్రభుత్వ భూమిని పోలీస్ పటేల్ దగ్గర నుండి తీసుకుని వడ్డెర హరిమాల సొసైటీకి రిజిస్ట్రేషన్ నెంబర్ టిబి 366/88 ఇచ్చారు. ఈ నేపథ్యంలో వడ్డెర్లకు అండగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ ఈ భూమిలో పర్యటించి మాట్లాడుతూ వడ్డెర్లు 50 సంవత్సరాలుగా ఈ భూమిలో వడ్డెర వృత్తితో జీవనం సాగిస్తున్నారు. కొంతమంది పెత్తందారు ఈ భూమిపై కన్ను వేసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని రక్షణ కల్పించాలని కోరారు. వడ్డెర్లపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లపు శివకుమార్, పల్లపు ఆంజనేయులు, పల్లపు రంగయ్య, యాదయ్య, బాల్‌రాజ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయాలి: టిజెఎస్

**మన్సూరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ఈనెల 10 తేదిన నిర్వహించే తెలంగాణ బచావో రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్లె వినయ్‌కుమార్, ఎల్‌బినగర్ ఇంచార్జీ కే.వి.రంగారెడ్డిలు కోరారు. ఎల్‌బినగర్ చౌరస్తాలో శ్రీకాంత్‌చారి విగ్రహం వద్ద బుధవారం టిజెఎస్ నాయకులు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి ఉద్యమ స్ఫూర్తిని మరిచి కెసిఆర్ ప్రభుత్వం పని చేస్తుందని, ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్తిక్‌రెడ్డి, కొత్తరవి, మదుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, వెంకటరెడ్డి, పరమేష్‌యాదవ్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడ బిడ్డ వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేత

**జవహర్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కె.ఎన్.ఆర్ కాలనీలో నివాసం ఉండే అందాలు శంకర్ కుమారుడు వివాహానికి బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ నాగమణి దంపతులు పుస్తె, మెట్టెలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఉండే పేదింటి బిడ్డలకు తమవంతు సహకారం అందించడానికి తాము ఎల్లప్పుడు ముందుంటామన్నారు. పేద ప్రజలకు సేవ చేయడంలో ఉన్న ఆనందరం మరెక్కడ దొరకదన్నారు. ఈ కార్యక్రమంలో వరుడు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 8 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిలుకానగర్ వార్డు కార్యాలయంలో డివిజన్ అధ్యక్షురాలు సుభద్ర ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ బన్నాల గీత పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు సరిత, అండాలు, షైనాజ్, లక్ష్మి, ఉమ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉప్పల్‌డివిజన్ టివికాలనీ, లక్ష్మినారాయణకాలనీలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ రకాల పోటీలలో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లుకాస్, సత్తిరెడ్డి,భవానీ, మాచర్ల ప్రతిభ, నాగమణి, ఇందుమతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చిలుకానగర్‌లో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దాసరి కృష్ణ, బూర్గల రమేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, యూత్ నేతలు వంజరి సంతోష్, బొల్లం లక్ష్మణ్, నరేష్, మధుసూధన్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో ఆదానీ, అంబానీలకే దోచిపెడుతున్న దేశ సంపద : చల్లా



ధర్నాలో ప్రసంగిస్తున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్,మార్చి 8 ప్రభాతవార్త:** మోడీ పాలనలో ఆదాని, అంబానీలాంటి బడాపారిశ్రామికవేత్తలు దేశ సంపదను దోచుకుంటున్నారని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. మోడీ, ఆదానీ దోస్తీ పాలనలో ఎల్‌ఐసి, ఎస్‌బిఐ బ్యాంకు లూటీలను వ్యతిరేకిస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు బాలాపూర్‌చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ దేశానికే గర్వకారణమైన ఎస్‌బిఐ, ఎల్‌ఐసి తదితర సంస్థలను మోడీ ప్రభుత్వం బలవంతంగా ఆదానీ గ్రూపు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేలా చేసిందని అన్నారు. మోడీ పాలనలో సామాన్యులకు అన్యాయం బడా బాబులను లాభం జరుగుతున్నదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు ఏనుగు జంగారెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, బంగారు బాబు, సామిడి గోపాల్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహిళలకు కేసీఆర్ పెద్ద పీట: మురుకుంట్ల



మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, మార్చి 8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్‌ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మురుకుంట్ల అరవింద్ హాజరై మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, చామల శైలజరెడ్డి, ఊర్మిళరెడ్డి, మాదవి, యాదమ్మ, బుజ్జిబాయ్, మున్నేమ, నాయకులు కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి: జక్కిడి



పారిశ్వద్ధ కార్మికులను సన్మానిస్తున్న జక్కిడి

**మన్సూరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయాలలో సమాన హక్కు సాధించుకున్నప్పుడే మహిళాదినోత్సవానికి సార్థకత ఏర్పడుతుందని ఎల్‌బినగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్‌లోని తన నివాసంలో పారిశ్వద్ధ కార్మికులను ఆయన శాలువలతో సన్మానించి వారికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పోరాటం నుంచి కార్మిక ఉద్యమాల నుంచి పుట్టిందే మహిళాదినోత్సవమన్నారు. చట్టసభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుడ్డ సత్యనారాయణ, సామలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పూర్తిచేసి సమస్యలు లేకుండా చూస్తాం : కార్పొరేటర్



సీసీరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** కాలనీలలో అన్ని రకాల అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ పాతగ్రామం రజకబస్తీలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రజక బస్తీలో పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, గతంలో బీజేపీ కౌన్సిలర్ పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పనులేతప్ప మరే ఇతర పనులు పూర్తిచేయలేదన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. సీసీరోడ్డు పనులలో నాణ్యతను పాటించి త్వరగా పూర్తిచేయాలని కాలనీలో వాల్‌టువాల్ సీసీరోడ్డు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, ఎర్రవెల్లి సత్యనారాయణ, బండారి స్వామి, ఆగమయ్య, హరికృష్ణ, బండారి రవి పాల్గొన్నారు.

## ఇఎస్ఐ హాస్పిటల్లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



సూపరింటెండెంట్ డా.కె.కమలను సన్మానిస్తున్న దృశ్యం

**నాచారం, మార్చి 8 ప్రభాతవార్త:** ఇఎస్ఐ ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని నాచారం ఇఎస్ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. కె.కమల పేర్కొన్నారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డా.కమల మాట్లాడుతూ వైద్య సిబ్బంది రోగులకు ఇబ్బందులు కలుగకుండా తగినజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళా సిబ్బంది ఎదుర్కుంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ ప్రతినిధులు జి.విక్టర్, చంద్రకళ, జమిమా, భాగ్య, అరుణ, సౌందర్య, ప్రేమలత, బాలేశ్వరి తదితరులు సూపరింటెండెంట్ డా.కమలను ఘనంగా సత్కరించారు.

**కార్పొరేటర్ శాంతిశేఖర్‌కు సన్మానం...** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు శాంతిసాయిజన్‌శేఖర్‌ను గద్ద యుగేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిజన్ శేఖర్, నాయకులు కట్టబుచ్చన్న గౌడ్, శ్రీరాం సత్యనారాణయ, చంద్రశేఖర్, సుగుణాకర్ రావు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : రాజ్యలక్ష్మి..



కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యలక్ష్మి, మల్లిఖార్జున్ తదితరులు

**నేరేడ్‌మెట్, మార్చి 8 ప్రభాతవార్త :** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్‌పరిధిలోని చంద్రగిరికాలనీ కమ్యూనిటీ హాల్‌లో సంతోషిమా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజం ఎన్నో సవాళ్ళతో కూడుకుందని దానిలో పురుషులతో ధీటుగా మహిళలు ఎంతో ధైర్యం కనబరుస్తూ సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకోకుండా వాటిని ఏ విధంగా అధిగమించాలో ఆలోచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మల్లిఖార్జున్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, మల్కాజిగిరి సర్కిల్ బిఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు బొమ్మిది అరుంధతి, రిసోర్స్ పర్సన్ పావని, రాధ తదితరులు పాల్గొన్నారు.

**అర్.కె.పురంలో..** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడ్‌మెట్ డివిజన్ అర్.కె.పురం ఆఫీసర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ బిఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు మహపాత్ర, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలి : మేయర్ చిగిరింత పారిజాత



కేకు కట్ చేస్తున్న మేయర్ పారిజాత, మహిళా కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, మార్చి 8 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి కేకు కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు గౌరవించబడుతూ వారికి ప్రోత్సాహం అందించినప్పుడు సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో మేయర్, మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిఇఇ జ్యోతి, కార్పొరేటర్లు సునీత శ్రీకాంత్‌గౌడ్, సంతోష్‌శ్రీనివాస్‌రెడ్డి, లలితాకృష్ణ, భారతమ్మకొమురయ్యయాదవ్, రోహిణిరమేష్ ముదిరాజ్, అనితారాణిప్రభాకర్, కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, రఘునందనచారి, ఎఇఇ రాంప్రసాద్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్‌బాబు, ఎస్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత : ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

**మలక్‌పేట, మార్చి 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఆయననివాసంలో జరిగిన కార్యక్రమంలో సిఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమంకోసం సిఎం కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని కెసిఆర్ సారథ్యంలో రాష్ట్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. సిఎం సహాయనిధి పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు : అనురాధ



వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న అనురాధ తదితరులు

**తుర్కయంజాల్, మార్చి 8 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 18వ వార్డ్‌లో తెలంగాణ పిసిసి సభ్యులు కాకుమాను సునీల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ఉదయం కోడి కూచింది మొదలుకుని రాత్రి కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించే వరకు మహిళ అవిశ్రాంతంగా పనిచేస్తునే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీమతి మేతరి అనురాధ దర్శన్ , కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్‌గౌడ్ , కమ్మగూడ మాజీ వార్డ్ మెంబర్ సావిత్రి, పాల్గొన్నారు.

**కోసికె ఐలయ్య ఆధ్వర్యంలో...** రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికె ఐలయ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ అనురాధ, వైస్ చైర్ పర్సన్ హరిత ధనరాజ్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్ కౌన్సిలర్లతో కలిసి మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా శ్రీ సత్యదేవుని గజవాహన రథోత్సవ సేవ



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎన్వీఎస్ఎస్, కార్పొరేటర్ శ్రీవాణి

**రామంతాపూర్, మార్చి 7 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో అర్థ శతాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటి ఫౌండర్ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఎం.సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో బుధవారం శ్రీవారి గజవాహన రథోత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం హోమము, బలిహరణము, సుదర్శన నారసింహ ఇష్టి, శ్రీవారి గజవాహన రథోత్సవసేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, నాయకులు ఎం.జగదీష్, రేవు నరసింహ, వెంపటి శ్రీనివాస్, మోహనకృష్ణ, సంకూరి కుమారస్వామి, ఉపేందర్, బాలకృష్ణ, కె.దయానందరెడ్డి, వి.సంతోష్‌గుప్త, బి.లింగం తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతితోనే అభివృద్ధి



పారిశుద్ధ కార్మికులను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మార్చి 8 ప్రభాతవార్త :** మహిళల అభ్యున్నతిని అభివృద్ధి సాధ్యమవుతుందని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. మహిళా దినోత్సవసందర్భంగా పారిశుద్ధ్య విభాగం మహిళా కార్మికులను ఉప్పల క్యాంపు కార్యాలయం వద్ద ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న శాలువాలతో సత్కరించి, చీరలు పంపిణీ చేశారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా ఆయన కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ సురేందర్, ఇమ్మడి రమేష్, శ్రీనివాస్, సరళ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీని కలిసిన ప్రవాస భారతీయుడు

**సైదాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** లండన్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీని అక్కడ నివసిస్తున్న నగరానికి చెందిన ప్రవాస భారతీయుడు, ప్రవాస కాంగ్రెస్‌యువజన విభాగం ఉపాధ్యక్షుడు బికుమాండ్ల రాకేష్ కలిసారు. భారత్ జోడో యాత్ర విజయవంతం అయిన నేపథ్యంలో ఆయన రాహుల్‌గాంధీని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జోడో యాత్ర ద్వారా దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించామని రాహుల్‌గాంధీ తెలిపినట్లు రాకేష్ పేర్కొన్నారు.